ప్రజాశక్తి
గురువారం 9 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



రేపు జెడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల పదో తేదీన జిల్లాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి జెడ్‌పి సమావేశ మందిరంలో 6వ స్థాయీ సంఘ సమావేశం ఉదయం 10.30 గంటలకు, 3వ స్థాయీ సమావేశం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు, 5వ స్థాయీ సమావేశం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని వివరించారు. 2, 4, 1, 7వ స్థాయీ సంఘ సమావేశాలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

పచ్చని ఉద్దానంలో విధ్వంసం వద్దు



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

- ప్రజల భూముల జోలికొస్తే ప్రజా ప్రతిఘటన తప్పదు
- కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన రద్దు చేయాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో పచ్చని ఉద్దానంలో విధ్వంసం సృష్టించవద్దని మాజీ మంత్రి, రైతుసంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, మహదేవ్ అన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదన రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ పోలీసుల ఆంక్షల నడుమ మండలంలోని ఎం.గంగువాడలో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భూముల జోలికి వస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలో ఎయిర్‌పోర్టులకు అనుబంధంగానే కార్గో ఎయిర్‌పోర్టు ఉంది తప్ప ఎక్కడా ప్రత్యేకంగా లేదన్నారు. మూలపేట పోర్టులోగానీ, భోగాపురం ఎయిర్‌పోర్టులో గానీ కార్గో ఎయిర్‌పోర్టు కట్టడానికి అవకాశాలున్నా, ఇక్కడే ఎందుకు కడుతున్నారని, ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. కాకరాపల్లి పవర్ ప్లాంట్‌కు బలవంతంగా 2020 ఎకరాలు గుంజుకొని ఈస్ట్‌కోస్ట్ కంపెనీకి ఇచ్చారని, ఒక్క ఉద్యోగమైనా మీరు ఇప్పించారా అని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు పేరుతో లక్షలాది జీడి, కొబ్బరి చెట్లను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతిని సునామీలు వచ్చినప్పుడు జిల్లా విధ్వంసం అవుతుందని తెలియ దా అని ప్రశ్నించారు. జిల్లాలో ఒకవైపు అణు విద్యుత్, మరోవైపు థర్మల్, కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు.

సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, తాండ్ర ప్రకాష్, లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు మాట్లాడుతూ రూ.600 కోట్లు పెడితే నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేస్తే, ఈ జిల్లాలో రెండు పంటలు పండి సస్యశ్యామలమవుతుందన్నారు. నేరడి బ్యారేజీ ఎందుకు నిర్మించడం లేదని కేంద్రమంత్రిని ప్రశ్నించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి పలాస ప్రాంతానికి తాగడానికి నీరివ్వలేని వారు అభివృద్ధి కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి వలసలు ఉన్నాయని, భూములు కోల్పోతే ఉపాధి లేక అవి ఇంకా పెరుగుతాయన్నారు. ప్రభుత్వం సెక్షన్-30 విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, న్యూ డెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, జీడి రైతుసంఘం జిల్లా కార్యదర్శి తెప్పల అజయ్, రాంపురం సర్పంచ్ ధర్మారావు, కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణరావు, వర్మ, పత్రి దానేష్ తదితరులు పాల్గొన్నారు.

గత కొన్నేళ్లుగా వర్షాభావం వల్ల, శాశ్వత నీరు లేక మండలంలోని సక్రమంగా పంటలు పండక, పెట్టుబడులు రాక రైతులు అప్పుల పాలవుతున్నారని వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షులు మార్పు మన్మథరావు, ఉపాధ్యక్షులు ధర్మాపు వెంకటరావు, నల్ల హడ్డి, మట్ట ఖగేశ్వరరావు, ఉగ్రిపిల్లి సోమనాథం, కొవ్వూరు దశరథి, నర్సింగ్ నాథ్‌సాబ్ అన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పలాస మండలం బొడ్డపాడు సమీపంలోని వేపాడు చెరువు నుంచి ఉద్దానం వైపున ఉన్న జంతిబం దను, పల్లపు వైపునున్న శంకుజోడు దామోదర్ సాగర్‌లను మినీ రిజర్వాయర్లుగా మార్చి అనుసం ధానం చేస్తే పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందుతుందని అన్నారు.

ఏమిటీ అలసత్వం... ఎందుకీ నిర్లక్ష్యం

మండల రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ విప్ ఒకవైపు, కలెక్టర్ మరోవైపు కలిసి సమీక్ష నిర్వహించి రైతుల సమస్య పరిష్కరించాలని ఆదేశించి వారం రోజులు గడిచినా దానిపై ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని తహశీల్దార్ మురళీమోహన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో జాప్యానికి గల కారణం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్లిపుట్టుగతో పాటు మండలంలో జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు పరిష్కారం కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్లో బుధవారం నిర్వహించిన పలాస డివిజన్ రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి కవిటి మండలం బల్లిపుట్టుగ చేరుకున్నారు కలెక్టర్. వచ్చిందే తడవుగా సమీక్ష నిర్వహించి వారం రోజులు గడిచిందని ఈ వారం రోజులు ఏం చేశారని రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి సమస్య పరిష్కారమయ్యే వరకూ రెవెన్యూ సిబ్బంది గ్రామంలోనే ఉండి పనిచేయాలన్నారు. తాను ఏ సమయంలో వివరాలు అడిగినా చెప్పే పరిస్థితి ఉండాలని స్పష్టం చేశారు. ముందుగా జాయింట్ ఎల్‌పిఎంలో ఉన్న రైతులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ విషయంలో పూర్తి పారదర్శకంగా పనిచేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురవాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. ఇప్పటి నుంచి 8 రోజుల్లోగా సమస్య పరిష్కారం కావాలని లేదంటే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పని పూర్తయ్యే వరకూ ఇక్కడే ఉండాలని ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, స్పెల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్‌డిఒ, డిఆర్‌ఒలకు ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ జి.వెంకటేష్, డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తాం, చదువుకోండి

కంచిలి : ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం మా బాధ్యతని, విద్యార్థులు మాత్రం క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం రాత్రి కంచిలి అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డార్మెటరీ, వంటశాల, క్రీడామైదానం, ఇతర ప్రాంగణాన్ని పరిశీలించారు. డార్మెటరీలో విద్యుత్ పనులకు సంబంధించి తక్షణం రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానం, తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సూచించారు. ఈయన వెంట జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, ఎంపిడిఒ వి.తిరుమలరావు, ఎంఇఒలు శివరాంప్రసాద్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటి, నీట్ లక్ష్యాల వైపు ప్రేరణ

ఈ సందర్భంగా కలెక్టర్ వారి వారి తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఐఐటి, నీట్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ప్రేరణ కల్పించారు. జెసి విద్యార్థులతో మాట్లాడుతూ వారి ప్రశ్నలకు సమాధానమిచ్చి ఉత్సాహపరిచారు.

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

పలాస : కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం పలాస డివిజన్ రెవెన్యూ అధికారులతో పిజిఆర్ఎస్, మ్యుటేషన్, ఎఫ్‌లైన్, రీ సర్వే, కోర్టు కేసులపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్ బుధవారం సమీక్షించారు. మండలాలు వారీగా సమీక్ష జరుగుతున్న తరుణంలో కవిటి మండలానికి సంబంధించిన ఎల్‌పిఎంల సమస్య పరిష్కారం చేశారా? లేదా అని తహశీల్దార్ మురళీమోహన్‌ను అడిగారు. తహశీల్దార్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. వెంటనే సమావేశాన్ని అర్ధాంతరంగా సగంలో నిలిపి వేసి కవిటి మండలానికి కలెక్టర్, జెసి ఫర్మాన్ అహ్మంద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, ఆర్‌డిఒ జి.వెంకటేష్, డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు వెళ్లిపోయారు. ఇటీవల ప్రభుత్వం విప్ బెందాళం అశోక్ సమక్షంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించే సమయంలో జాయింట్ ఎల్‌పిఎంలు పరిష్కారం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆ విషయంపై కవిటి తహశీల్దార్ నిర్లక్ష్యం వహించడంతో కవిటి మండలానికి కలెక్టర్ వెళ్లినట్లు తెలుస్తోంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి


ప్రజాశక్తి - శ్రీకాకుళం



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పబ్లిక్ ప్రదేశాల్లో న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ఈనెల 6న మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన తమిరి సాయికి మెజిస్ట్రేట్ 45 రోజుల జైలు శిక్ష విధించిందని తెలిపారు. రోడ్డుపై వీరంగం చేసి వాహన రాకపోకలకు అంతరాయం కలిగించడంతో ట్రాఫిక్ సిఐ నాగరాజు నిందితుడిని అదుపులోకి తీసుకుని సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారని పేర్కొన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసి, జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించినా రిమాండ్‌తో పాటు జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలనూ ప్రమాదంలోకి నెడుతుందని గుర్తుంచుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఎలాంటి మినహాయింపు ఉండదని, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

శ్రీకూర్మం ఆలయ అభివృద్ధికి కృషి

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు



నూతన ట్రస్టు బోర్డు సభ్యులతో అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి - గార

శ్రీకూర్మం ఆలయ అభివృద్ధికి పాటుపడాలని నూతన ట్రస్టు బోర్డు సభ్యులకి గోవా గవర్నర్, శ్రీకూర్మం దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు సూచించారు. శ్రీకూర్మనాథ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, ఇక్కడి విలువైన పెయింటింగ్స్, శిల్పకళను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో పుష్కరిణి అభివృద్ధికి ఇండిగో సంస్థ రూ.పది కోట్లు ఇచ్చిందని తెలిపారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కోట నరసింహనాయుడు మాట్లాడుతూ సింహాచలంలోని శ్రీకూర్మనాథ స్వామి వారి ఆలయానికి సంబంధించిన బంగారాన్ని స్వామి వారికి ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, తహశీల్దార్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాలిహుండంలో బౌద్ధ స్థూపాలు, మ్యూజియంను పరిశీలించారు. తొలుత జిల్లాకు వచ్చిన గోవా గవర్నర్‌కు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా కుటుంబాల సుస్థిరతే ధ్యేయంగా మెప్మా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మెప్మా, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో మాట్లాడారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన ఒక కుటుంబం ఒక పారిశ్రామిక నినాదాన్ని సంఘ మహిళల్లో బలోపేతం చేస్తున్నామన్నారు. అదనంగా ఆయా కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగతను నిర్మూలించేందుకు మూడు నెలలకోసారి మెప్మా ఆధ్వర్యాన జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు. జాబ్‌మేళాలో భాగంగా 1972 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనుభవంతోనే మెరుగైన జీవనోపాధిని పొందగలరని చెప్పారు. అవకాశం చిన్నదా, పెద్దదా అన్నది ప్రాధాన్యత కాకుండా ప్రతిఒక్కరూ ఉపాధిని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మా రాష్ట్ర జీవనోపాధుల మేనేజర్ ఎన్.ఎన్.ఆర్ శ్రీనివాసరావు, నిపుణ డైరెక్టర్ నర్మదా రాణి, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, పట్టణ జిల్లా సమాఖ్య అధ్యక్షులు బి.నాగలక్ష్మి, వి.వెంకటలక్ష్మి, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో, హెచ్‌బిడి, ఎంఆర్ఎఫ్ తదితర 16 కంపెనీల ప్రతినిధులు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ

డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందని, దీని బారిన పడి యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అధ్యక్షతన ఐద్వా జిల్లాస్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు మహిళా సాధికారతను గాలికొదిలేశాయని విమర్శించారు. 33 శాతం రిజర్వేషన్ కోసం మహిళలు పోరాటాలు చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. మహిళా సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే రిజర్వేషన్ అమలు చేసేదని చెప్పారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేసి, మహిళా హక్కుల సాధన దిశగా ఈ మహాసభలు మార్గదర్శకత్వం కానున్నాయని తెలిపారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 13 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు జిఒ తీసుకురావడాన్ని దుయ్యబట్టారు. కొత్త ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి ఉన్న ఉద్యోగులకు పనిభారం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి మాట్లాడుతూ రంగాలు, సంఘాలన్న బేధం లేకుండా కలిసికట్టుగా మహిళా సమస్యలపై పనిచేయాలన్నారు.

సిజెఐపై దాడి హేయమైన చర్య

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై కుల అహంకార మౌఢ్యాన్ని తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసరడాన్ని అత్యంత హేయమైన చర్య అని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ, జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ నగరంలోని పాతబస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు అధికారంలోకొచ్చాక దళితులు, మైనార్టీలపై అనేక రూపాల్లో దాడులు జరుగుతున్నాయన్నారు. అత్యున్నత న్యాయస్థానంలోనే ఇలాంటి ఘటన జరగడం దేశంలోని 140 కోట్ల మందికి అవమానకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి తెగబడిన కులదురహంకారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.లతాదేవి, ఐద్వా నగర కార్యదర్శి టి.ప్రవీణ, శ్రీదేవి పాణిగ్రాహి, జానకి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి

ఐబిఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే ఐబిఎం క్వాంటమ్ కిస్కిట్ ఫాల్ ఫెస్ట్-25కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ఎంపికైంది. ప్రపంచవ్యాప్తంగా వందలాది విశ్వవిద్యాలయాలు పోటీ పడగా, కేవలం 55 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపికయ్యాయి. భారత్ నుంచి ఎంపికైన పది సంస్థల్లో రాష్ట్రం నుంచి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ఒక్కటే చోటు దక్కించుకోవడం విశేషం.

నాలుగు క్యాంపస్‌లలో నిర్వహణ

ఈ క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌ల్లో శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్.కె వాలీలో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా ఇందులో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో క్వాంటం కంప్యూటింగ్ అభివృద్ధి, ఈ రంగంలో ఉన్న అవకాశాలపై అవగాహన పెంచేందుకు వర్క్‌షాప్‌లు, నిపుణుల ఉపన్యాసాలు, హ్యాకథాన్‌లు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి డీన్ ఎకడమిక్స్ డాక్టర్ ఎం.శివరామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ ఫెస్ట్‌కి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ క్వాంటం ఫాల్ ఫెస్ట్ అనేది యువతకు భవిష్యత్ సాంకేతికతపై నైపుణ్యాలను అందించడానికి రూపొందించబడిన ఒక ఉన్నత స్థాయి సాంకేతిక ఉత్సవమన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్.వాసు, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ జి.రవి, డిప్యూటీ ఎఒ సూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనాస్థలి పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గంగరాజపురం పరిధిలోని గ్రానైట్ క్వారీలో మంగళవారం పిడుగుపాటు ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందడం విదితమే. ఈ ఘటనపై ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి బుధవారం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అక్కడ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక పోలీసు అధికారులను నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలంలో సంఘటనపై క్లూస్ టీమ్ సాంకేతిక నిపుణులు తెలిపిన భౌతిక అధారాలు, ఇతర వివరాలు బట్టి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీ ప్రదేశాల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై తగు సూచనలు తెలిపారు. మెరుపులు పిడుగులు వల్ల ప్రమాదాన్ని నియంత్రణకు విద్యుత్ గ్రౌండింగ్ వ్యవస్థలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వివరించారు. గ్రానైట్ క్వారీలో పోలీసు అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పిడుగుల వల్ల కలిగే ప్రమాదాలను నివారించేందుకు వర్షాకాలంలో మెరుపులు, ఉరుములు సంభవించినప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుంపులుగా నిలబడరాదని అన్నారు. పెద్ద చెట్ల కింద నిలుచోవడం తప్పించుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టేలా చూడాలని దిశా నిర్దేశం చేశారు. ఈయనతో పాటు టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, పాతపట్నం సిఐ సన్యాసినాయుడు, మెళియాపుట్టి, పాతపట్నం ఎస్‌ఐలు రమేష్‌బాబు, మధుబాబు ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



టెక్కలి రూరల్ : పరామర్శిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

మెళియాపుట్టి మండలం గంగరాజపురంలోని ఓ గ్రానైట్ క్వారీ వద్ద పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెంది, నలుగురు గాయపడ్డాడు. వీరు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి బుధవారం క్షతగాత్రులను పరామర్శించారు. కూలి పనులు చేస్తూ పిడుగుపాటుకు గురై షాక్ నుంచి బయటపడిన తీరును క్షతగాత్రులు వివరించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అత్యవసరమైతే రిమ్స్‌కు తరలించాలని సూచించారు. మెళియాపుట్టి మండలం ప్రాంతంలో ఎక్కువ పిడుగుపాటు ప్రమాదాలు సంభవిస్తున్నందున శాస్త్రీయంగా నివారణకు కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిడుగుపాటుకు గురై మృతి చెందిన కార్మికుల మృతదేహాలను పోస్టుమార్టం గదిని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, వైద్యులు ఇందూ సింహా, లక్ష్మణరావు, ఫోరెన్సిక్ మురళి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న స్థానికులు

సెల్‌టవర్ నిర్మాణం వద్దు

శ్రీకాకుళం సిటీ: పట్టణంలోని శాంతినగర్‌కాలనీ సమీపంలోని నెహ్రూనగర్ వద్ద సెల్‌టవర్ నిర్మాణానికి కంపెనీ ప్రతినిధులు పూనుకోవడంతో స్థానికులు ఆందోళనతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జనావాసాల నడుమ సెల్‌టవర్ నిర్మాణం జరిపితే రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యానికి లోనవుతామంటూ స్థానికంగా ఉన్న పెద్దలు, కాలనీవాసులు పనులు జరపకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సెల్‌టవర్ నిర్మాణం వల్ల ప్రశాంతంగా జీవిస్తున్న తమకు రేడియేషన్ ప్రభావంతో అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. శాంతినగర్ కాలనీలో ఎక్కువమంది విశ్రాంత ఉద్యోగులు కుటుంబాలతో ప్రశాంతంగా నివసిస్తున్న క్రమంలో తమ ఆరోగ్యానికి భంగం కలిగించేలా ఉన్న సెల్‌టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు దృష్టికి సమస్య తీసుకు వెళ్లారు. తాత్కాలికంగా సెల్‌టవర్ పనులు నిలిపివేశారు.

'ఐతమ్'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ కళాశాలలో మేనేజ్ మెంట్ స్టడీస్ విద్యార్థులు నూతన పరిచయం కార్యక్రమం అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక కొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది, ఎంబిఎ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, కొత్తగా చేరిన బిబి, ఎంబిఎ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఆహ్వానం పలికారు. విద్యార్థులు తమ ప్రతిభను వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రదర్శించి, పాటలు, నృత్యాలు, నాటికలు, హాస్య ప్రదర్శనలు వంటి వినోదాత్మక కార్యక్రమాలతో వేదికను కళకళలతో నింపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి లక్ష్మీశ్రీకాంత్, అధ్యాపకులు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, శివకుమార్, వేణుగోపాల్, వేణు, శివ, ప్రవీణ్, మౌనిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పొలాల మధ్యలో రహదారి లోగుట్టు తెలియాలి మరి..



కొత్తగా నిర్మించిన కల్వర్టుపై నిల్వ ఉన్న వరద నీరు

- బ్రిడ్జి లేకపోవడంతో నీట మునిగిన పొలాలు
- నష్టాల ఊబిలో అన్నదాతలు

ప్రజాశక్తి- బూర్జ

పచ్చని పంట పొలాల మధ్య కాలువ గట్లపైన నడుస్తూ చల్లటి పైరుగాలని పీల్చుతూ గమ్యానికి చేరుకునేవారు అది గతం. నేడు పంట పొలాల మధ్య నుంచి రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలోని మదనాపురం గ్రామం కూడలి నుంచి అల్లిన గ్రామానికి రహదారి వచ్చింది. కూటమి ప్రభుత్వం హఠాత్తుగా కోట్లాది రూపాయలను వెచ్చించి రహదారి నిర్మాణం చేపట్టడంలో ఉన్న ఆంతర్యం ఏమిటోనని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే గుసగుస లాడుకుంటున్నారు. కేవలం ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకే రహదారి నిర్మాణం చేపట్టామని నాయకులు, ప్రభుత్వ అధికారులు చెబుతున్నప్పటికీ లోగుట్టు పెరుమాళ్లుకే ఎరుకని స్థానికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లిన గ్రామం నుంచి మదనాపురం గ్రామానికి పొలాల మధ్య రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.6 కోట్లు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులను కేటాయించింది. 3.6 కిలోమీటర్ల రోడ్డును ఆర్‌అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో ఇంతవరకు పొలాల మధ్యలో మట్టిరోడ్డు వేసిన అనంతరం ప్రస్తుతం గ్రావెల్ వేశారు. అలాగే నది నుంచి వచ్చిన నీరు వెళ్లేందుకు ఎనిమిది కల్వర్టులు చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు ఐదు నిర్మించారని ఆర్‌అండ్‌బి అధికారులు చెబు తున్నారు.

ప్రయోజనం లేని రహదారి



పొలాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి ఎవరికి ప్రయోజనమో అర్థం కావడం లేదు. ఈ ఏడాది పొలాల మధ్య రహదారి ఏర్పాటు వలన పంటలు నష్టపోయాం. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- దుప్పాడ సూరప్ప నాయుడు, నీలాపురం

నది నీరు పొలాల్లోకి

గతంలో నది నుంచి వచ్చిన నీరు పొలాల మీదుగా నారాయణపురం ఆనకట్టుకు చేరిపోయేదని, అయితే పొలాలకు అడ్డుగా రహదారి ఏర్పాటు చేయడంతో నది నుంచి వచ్చిన నీరు బయటకు వెళ్లే అవకాశం లేక పొలాల్లోనే ఉండిపోవడంతో పంటలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

కల్వర్టులతో ఇబ్బందులు

పలుచోట్ల కల్వర్టులు ఏర్పాటు చేసినప్పటికీ నాగావళి నది నీరు పొలాల నుంచి బయటకు వెళ్లడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పలుచోట్ల వంతెనలు నిర్మించకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని, పొలాల మధ్య రహదారి వలన సౌకర్యం కలుగుతుందో లేదో తెలియదు గాని, ప్రస్తుతం తమ పంట పొలాలు నీట మునిగి పూర్తిగా నష్టపోయిన పరిస్థితి వచ్చిందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణంలో ఉన్న లోపాలను సరిదిద్ది రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారి నిర్మాణంలో ఉన్న అంతరార్థం ఏమిటో తమకు అర్థం కావడం లేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ఆర్‌అండ్‌బి జెఇ ఆంజనేయ నాయక్ వద్ద ప్రస్తావించగా గ్రామస్తులకు అనుకూలంగా రహదారి నిర్మాణం చేపట్టారని, ఇంతవరకు 50 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అదనంగా నిధులు విడుదలయితే బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.



సభ్యుల కోసం వేచిచూస్తున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేక వాయిదా పడింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలు దాటినా సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఎంపిడిఒ నడిమింటి రమేష్‌నాయుడు, డిటి మురళీకృష్ణ, ఐదుగురు ఎంపిటిసిలు, కొంతమంది సర్పంచ్‌లు సమావేశ మందిరంలో వేచి చూశారు. అయినా సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. వాస్తవానికి మండల పరిషత్‌లో 21 మంది ఎంపిటిసిలు, ఓ కో-ఆప్షన్ మెంబరు ఉన్నారు. వీరిలో ఏడుగురు సభ్యులు హాజరైతే చాలు సమావేశం నిర్వహించడానికి వీలు కలుగుతుంది. కానీ, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అనారోగ్యం కారణంగా హాజరు కాలేదు. అటు ఎంపిటిసిలు, ఇటు అధికారులు సైతం పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. వైస్ ఎంపిపి వంక రాజు, విప్ తిర్రి గుణ సభ్యులందరికీ ఫోన్లో సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో చేసేది లేక ఎంపిడిఒ గురువారం ఉదయం 10 గటలకు సమావేశం వాయిదా వేశారు.



అవగాహన కల్పిస్తున్న సిఇఒ సంజీవరావు

రైతులకు అవగాహన

కొత్తూరు: మండలంలోని కర్లమ్మ పంచాయతీ మాసింగ్‌లో ఉన్న వెలుగు అసోసియేషన్ ట్రైనింగ్ సెంటర్‌లో కొత్తూరు, పాతపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా భామిని, సీతంపేట మండలాల రైతులకు వాతావరణం మార్పు-ప్రభావాలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. గ్రీన్ హౌస్ అంటే ఏమిటి? గ్రీన్ హౌస్ ఉపయోగాలు, వాతావరణం మార్పు వల్ల కలిగే ప్రభావాలు, అడవి పెంచడం వల్లన కలిగే లాభాలు, అడవిలో దుంపలు, ఆకుకూరలు, మందులు ఉపయోగాలు, చిరుధాన్యాలు కొర్ర, సామ, రాగులు ఉపయోగాలు, పంట దిగుబడి పెంచేందుకు మెలకువలు, జీడీ ఫ్లునింగ్ వల్లన ఉపయోగాలు, వరి లైన్‌షోయింగ్ వాటి ఉపయోగాలు, పురుగు మందులు బదులుగా నీమస్త్రం, జిల్లేడు ద్రావణంపై వివరించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ సిఇఒ బి.సంజీవరావు, సీతంపేట ఐటిడిఎ హెచ్ఒ గణేష్‌కుమార్, సైనిస్టు వెంకటరావు, రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు, బి.వెన్నెల పాల్గొన్నారు.




పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

గ్రానైట్ క్వారీ పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం గ్రామ పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలో మంగళవారం పిడుగుపాటుకు గురై ముగ్గురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ప్రమాదంపై వివరాలు తెలుసుకునేందుకు బుధవారం అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కార్మికులకు సమయపాలనతో పాటు సరైన భద్రత కల్పించాలని అధికారులకు, క్వారీ నిర్వాహకులకు తెలియజేశారు. అలాగే ప్రమాదంపై త్వరితగతిన నివేదిక తయారు చేసి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కంప్యూటర్ల మొరాయింపు

వజ్రపుకొత్తూరు: మండలంలోని లక్ష్మీదేవిపేట 1,2 సచివాలయాల పరిధిలో కంప్యూటర్లు మొరాయించడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతునానరు. గత ఆరు నెలలుగా కంప్యూటర్లు పనిచేయకపోవడంతో కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలు పొందడానికి ప్రభుత్వానికి సేవా రుసుం చెల్లిస్తున్నా వాటిని పొందలేని దుస్థితి ఏర్పడింది. వాటిని ప్రింట్ తీసి ఇవ్వకుండా పిడిఎఫ్ ఇచ్చి వేరొక చోట మీ సేవల్లో, నెట్ షాపుల్లో కెళ్లి ప్రింట్ తీసుకోమని చెప్తున్నారు. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. బయట ప్రింట్ తీస్తున్నప్పుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. సచివాలయంలో తరగతి ధ్రువీకరణ పత్రాల ప్రింట్‌కు డబ్బుల కట్టి కూడా బయటికెళ్లి డబ్బులు ఇవ్వడమేమిటిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఎర్త్ కనెక్షన్ లేనందున కంప్యూటర్లు కాలిపోతున్నాయని చెపుతున్నారు. దయచేసి సిస్టమ్స్ బాగుచేసి ప్రజలకు సచివాలయం సేవలను అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన కంప్యూటర్లు

ఎట్టకేలకు రోడ్డు పనులకు చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

ఎట్టకేలకు రహదారికి మోక్షం లభించింది. ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'ప్రాణాలకు ముప్పు.. కలగదా కనువిప్పు' కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు దృష్టి సారించారు. అయితే మండల పరిధిలో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్యాచ్‌వర్క్‌లకు సంబంధించి రూ.21 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బి శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి.సత్యనారాయణ తెలిపారు. ప్రమాదాల నివారణకు తక్షణమే రహదారులకు ప్యాచ్‌వర్క్‌లను చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి


సంతబొమ్మాళి: అనకాపల్లి జిల్లా భీమబోయనపాలెంలో గురువారం నిర్వహించనున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. టెక్కలి నియోజకవర్గానికి చెందిన జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్థాయి కార్యకర్తలు పాల్గొవాలన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

వజ్రపుకొత్తూరు : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. దీంతో బుధవారం మండల విద్యాశాఖాధికారి వెంకట రమణ సమక్షంలో పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండో విడతగా 20,053 పాఠ్య పుస్తకాలు చేరాయని, ఈ మేరకు పుస్తకాలను అయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రాజేశ్వరికి వీణ అవార్డు

ప్రజాశక్తి- అరసవల్లి



అవార్డు అందుకున్న రాజేశ్వరి

రంగస్థలం నటి కేతిరెడ్డి రాజేశ్వరికి వీణ అవార్డు లభించింది. ఈమె ఇటీవల దసరాకి తెనాలి జాతీయస్థాయి నాటకోత్సవం, సాంఘిక పౌరాణిక నాటిక, నాటక పోటీలు నిర్వహణలో విశాఖపట్నం జై కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటకం 'సిరికేళి' నాటకంలో అనసూయ పాత్రకు రాజేశ్వరి ప్రదర్శనకు ఉత్తమ క్యారెక్టర్ నటిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు వీణ అవార్డును అందజేశారు. ఈ అవార్డు ఇచ్చిన సమయానికి ఆమె స్వగ్రామానికి వచ్చినందున ఆ వీణ అవార్డును సంస్థ వారు పంపించడం జరిగింది. ఈమెకు ఈ అవార్డు రావడంపై రంగస్థలం కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, చిట్టి వెంకటరావు, పన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్, గుత్తు చిన్నారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



శ్రమదానం చేస్తున్న గిరిజన యువకులు

గిరిజన యువత శ్రమదానం

ప్రజాశక్తి- బూర్జ

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గిరిజన యువత శ్రమదానం కోసం ముందుకు వచ్చారు. తమ గ్రామానికి అవసరమైన రహదారిని తామే ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని మశాన పుట్టి గిరిజన గ్రామంలో రహదారి నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయకపోవడంతో రోడ్డు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రహదారిని పూర్తిగా కప్పి వేయడంతో రాకపోకులకు ఇబ్బంది కలుగుతుండడంతో తమ గ్రామానికి అవసరమైన రహదారిని ఏర్పాటు చేసుకునేందుకు నడుంబిగించారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముల్ల పొదలను తొలగించి గోతులను కప్పి వేసి రహదారిని బాగు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ యువత కొండగొర్రె వెంకటేష్, పాలక రామ్‌నాయుడు, నిమ్మక సింహాచలం, కొండంగి బాలకృష్ణ, పాలక రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది, పెన్షనర్లు, కస్టమర్లకు బిపి, షుగర్, ఇసిజితో పాటు వివిధ రకాల వ్యాధులపై ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ సుశాంత్ కుమార్, సిబ్బంది, పెన్షనర్ సంఘం అధ్యక్షులు సురవరపు సిమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, గౌరవ అధ్యక్షులు మోహనరావు, కోశాధికారి హెచ్.వి. సత్య నారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వి.రమణ పాల్గొన్నారు.

ఫలించిన రైతుల పోరాటం

300 మీటర్ల వరకు ఎజిఎల్ కనెక్షన్‌కు అనుమతి

ప్రజాశక్తి- కవిటి



కనెక్షన్లు ప్రారంభిస్తున్న ఎఇ శ్రీనివాస్‌రెడ్డి

గతంలో తోటలో, పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు దూరంగా ఉన్న రైతులు బోరు వేసుకోవాలంటే కష్టం. 195 మీటర్ల లోపల ఉన్న వారికే విద్యుత్ సరఫరా అంటూ ఎన్నో నిబంధనలు చెప్పేవారు. అయితే మండలంలోని చిన్నజల్లుపుట్టుగకు చెందిన రైతులు దీనిపై పోరాటం చేశారు. తమ వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్ ఎంత అవసరమో, దాని మంజూరులో అన్ని నిబంధనలు తమకు సమస్యగా మారుతున్నట్టు ప్రభుత్వానికి తెలియజేశారు. దీంతో వారి దీర్ఘకాల పోరాటం ఫలించింది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ల విస్తరణపై నెలల తరబడి సాగిన ఆందోళనకు ప్రభుత్వం స్పందించింది. గత ఫిబ్రవరిలో జారీ చేసిన కొత్త మార్గదర్శకాలతో, ఇంతవరకు ఉన్న 195 మీటర్ల పరిమితిని 300 మీటర్ల వరకు పెంచుతూ ప్రభుత్వం కొత్త జిఒ విడుదల చేసింది. ఈ నిర్ణయంతో స్థానిక రైతులకు పెద్ద ఊరట లభించింది. బుధవారం విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కొత్త ఎజిఎల్ కనెక్షన్లు ప్రారంభమయ్యాయి. రైతుల ఐక్యత, పట్టుదలతో సాధించిన ఈ విజయాన్ని గ్రామస్తులు హర్షాతిరేకాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎజిఎల్ కనెక్షన్ల విస్తరణతో సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు, పంటల ఉత్పాదకత కూడా మెరుగవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.



టెక్కలి రూరల్ : కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

సిజెఐపై దాడికి నిరసన

ప్రజాశక్తి- కవిటి

సిజెఐ జస్టిస్ గవాయిపై బూటుతో దాడి చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఇది హేయమైన చర్యగా అభివర్ణించారు. కవిటిలో అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసిన ఆయన, ఇది రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అని పేర్కొన్నారు. విద్వేషం, ఉన్మాదం సమాజాన్ని చుట్టుముట్టుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెక్కలి రూరల్ : సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన టెక్కలి అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘ నాయకులు కొవ్వొత్తులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మతోన్మాదులను బిజెపి ప్రభుత్వం పెంచి పోషిస్తుందని అవేదన వ్యక్తం చేశారు లాయర్ వృత్తిలో ఉండి దాడి చేయడం హేయమైన చర్యని, వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు వెలమర ప్రభాకరరావు, చల్ల రామారావు, కోత ధర్మారావు కొల్లి ఎల్లయ్య, ఆట్ల రాహుల్ కుమార్ పాల్గొన్నారు.



డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మోసమే చంద్రబాబు నైజం

రణస్థలం రూరల్: ఎన్నికల ముందు హామీలిచ్చి తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని వల్లభరావుపేట, నారువ, చిల్లపేటరాజాం కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు అధిష్టానం తప్పనిసరిగా గుర్తింపునిస్తుందన్నారు. మెంటాడలో డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యకర్తలకు డిజటల్ బుక్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాయపురెడ్డి భుజంగరావు, గొర్లె శ్రీనివాసరావు, మజ్జి రమేష్, దన్నాన హరి, బాకి సూర్యనారాయణరెడ్డి, టేకు బ్రహ్మాజీ, దన్నాన సీతారాం, లంక లపల్లి శంకర్, బాకి అర్జునరెడ్డి, ధోని అప్పన్న పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు



పిచ్చి మొక్కల తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

మండలంలోని కింతలి నుంచి రాపాక కూడలి వరకు గల రహదారిలో ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను బుధవారం ఎస్ఐ వి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బి ఎఇఇ పి.టి.రాజు తొలగించారు. మండలంలో పలు రహదారుల్లో ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ప్రమాదాలు జరుగుతుండడంపై సెప్టెంబర్ 3న 'ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు' అంటూ ప్రజాశక్తిలో ప్రచురుతమైన కథనానికి అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ పిచ్చిమొక్కల కారణంగా ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. ఎట్టకేలకు రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారిన పిచ్చి మొక్కలను తొలగించడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలో మిగిలిన పలు రహదారుల్లో కూడా ప్రమాదాలకు కారణమవుతున్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తవ్వుతున్న కంకర

కరుగుతున్న మణిగాం కొండ


ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని వల్లపరాయనపేట పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబరు 43 మణిగాం కొండ సర్వే అక్రమార్కుల చేతిలో కనుమరుగవుతుంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా కనిపించే మణిగాం కొండను అక్రమంగా కంకరను తవ్వేస్తున్నారు. 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కొండ కుచించుకుపోయి నాలుగైదు ఎకరాలు మాత్రమే కనిపిస్తుంది. కొండ చుట్టూ అక్రమ కంకర తవ్వకాలు చేపట్టి కాసులు కురిపించుకుంటున్నారు. కానీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు నెవ్వెరపోతున్నారు. రోజూ రాత్రి, పగలు తేడా లేకుండా ప్రొక్లెయినర్‌తో తవ్వకాలు చేపడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. తక్షణమే అధికారులు చొరవ చూపి అక్రమార్కులపై కొరడా ఝుళింపాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలి

పియుసి చైర్మన్ రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస



సమీక్షా సమావేశంలో పాల్గొన్న రవికుమార్

పారదర్శకత ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వ కార్పొరేషన్లు పనిచేయాలని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం రాజధాని అమరావతిలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ పియుసి ఆధ్వర్యంలో కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు టిడిపి కార్యాలయం పేర్కొంది. ఈ సందర్భంగా పియుసి పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల వార్షిక ఆదాయ వ్యయాలు, ఆర్థిక వ్యవహారాలు, నిధుల వినియోగం, భవిష్యత్ ప్రణాళికలు వాటి పనితీరుపై ఈ సమావేశంలో చర్చించారు. ప్రతి కార్పొరేషన్ సమగ్ర ఆర్థిక నివేదికలను సమీక్షించిన చైర్మన్ రవికుమార్ ప్రజల డబ్బుతో నడుస్తున్న సంస్థలు పారదర్శకతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాధనం అత్యంత పవిత్రమైనదని ప్రతి ఒక్క రూపాయి వృథా కాకుండా సవివరంగా లెక్కలతో సహా ఉండాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు వచ్చే విధంగా ప్రాజెక్టులను అమలు చేయాలని సూచించారు. సమావేశంలో పియుసి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, పియుసి అధికారులు, సంబంధిత కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు - దూసి రైల్వేస్టేషన్‌ల మధ్యలో గల తుంగపేట సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (38) మృతి చెందినట్లు బుధవారం జిఆర్‌పి హెచ్‌సి ఎస్.మధుసూదనరావు తెలిపారు. మృతుడు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఉంటాడని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడు శరీరంపై కాఫీ, నలుపు రంగు గల గడుల చొక్కా, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9110305494 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో కొయిరాల జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలైన ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళంలో నగరంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా వంగర మండలం సంగాం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మోటర్ బైక్‌పై తీసుకు వస్తుండగా ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో అక్కా చెల్లెలు అయిన జి.రామని, జి.ఇందు, ఫరీద్‌పేటకు చెందిన ఓ వ్యక్తి గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పలాస

గంజాయిని అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి మహమ్మద్ ఫయాజ్‌ను అరెస్టు చేసి ఆయన వద్ద మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్నేళ్లుగాకర్ణాటక ప్రాంతానికి మహమ్మద్ ఫయాజ్ బరంపురంలోని కొనుగోలు చేసిన గంజాయిని అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి రవాణా చేస్తుండేవాడు. బరంపురం నుంచి పలాస వరకు బస్సులో వచ్చి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా... ఆయన వద్ద ఉన్న బ్యాగును పరిశీలించి మూడు కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.



తేజ్ భరత్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

మెప్మా డైరెక్టర్ అరసవల్లి సందర్శన

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని బుధవారం మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ, డిప్యూటీ కమిషనర్ కెఎన్‌విడివి ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులను సరిచేయాలి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిజగన్నాథపురం పంచాయతీలో సర్వే నంబరు 311లో తలెత్తిన భూ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ బత్తిన ప్రసాదరావు, రైతులు టి.చంద్రయ్య, డి.లక్ష్మి, టి.సుధ, జి.జానకమ్మలు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ సీతారామయ్యను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. తాము గ్రామంలో పెద్దల సమక్షంలో కళిశెట్టి సోమేశ్వర రావు ఆస్తికి ఈశాన్యంలో బస్టాండ్ నిర్మాణా నికి ఇటీవల మండల సర్వేయరు తిరుపతి రావుతో 311లో చేయించామన్నారు. అక్కడ సర్వేలో భూమికి ఇచ్చిన హద్దులకు తరువాత అదే సర్వే నంబరు పక్కన గ్రామంలో ఇంకో రైతు తిమ్మల కృష్ణారావు ఆస్తికి సంబంధించి చేపట్టిన సర్వే హద్దులకు పొంతన లేదని, దీంతో గ్రామంలో తగాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. సర్వేయర్‌తో పూర్తిస్థాయిలో మళ్లీ సర్వేచేపట్టి హద్దులు నిర్ణయించి ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు



మాట్లాడుతున్న భానోజీనాయుడు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు అన్నారు. రణస్థలం పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హాయంలో సిఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహదాసు రమణయ్య, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకట రమణ, కెల్ల హేమంత్, వాళ్లే రమణ, ప్రసాద్, సెక్రటరీ జీవన్ కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రొట్టవలసలో పులి వేషాలతో సందడి

ఘనంగా నందన్న సంబరాలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గౌరీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా నందన్న సంబరాలు జరుగుతున్నాయి. బుధవారం మండలంలోని రొట్టవలసలో పులి వేషాలు వేసి ఊరంతా కలియ తిరుగుతూ ప్రజలను అలరించారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు గ్రామాల్లో నందన్న విగ్రహాలను ప్రతిష్ఠించి తిరువీధిగా ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. గ్రామ యువతీ యువకులు అలనాటి సంప్రదాయ వేషధారణలతో పాల్గొని ప్రతిరోజు పగటి వేషాలు, రాత్రివేళ వివిధ నాటికలు ప్రదర్శిస్తూ గ్రామాల్లో కళా సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

రాజేష్ పరామర్శ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణం లో ఇటీవల మృతి చెందిన జనసేన కార్యకర్తలు కుటుంబాలను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ బుధవారం పరామర్శించారు. మున్సిపాలిటీ బెల్లిపడ 13 వార్డు జన సైనికుడు నీలాపు శివ, సంతపేట 17వ వార్డు ఇన్‌ఛార్జి కర్రి నాగరాజులు ఇటీవల మృతి చెందారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈయన వెంటనే నాయకులు రోకళ్ల భాస్కరరావు, కృష్ణయ్య, కర్రి కృష్ణవేణి, కర్రి జగదీష్, మోహనరావు ఉన్నారు.



పరామర్శిస్తున్న రాజేష్

జిఎస్‌టిపై వ్యాసరచన పోటీలు

మెళియాపుట్టి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'సూపర్ సేవింగ్స్ - సూపర్ జిఎస్‌టి' అనే అంశంపై విద్యార్థులకు వివిధ పోటీలు బుధవారం నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్,, ఎలక్ట్రిషన్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రమౌళి అధ్యక్షతన ఈ పోటీలు నిర్వహించారు. ఆరో నుంచి పదో విద్యార్థులకు, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల మధ్య ఈ పోటీలు నిర్వహించారు. ప్రతి సచివాలయంలో నియమించిన జిఎస్‌టి జీఎస్టీ ఛాంపియన్స్ ఆఫీసర్లు పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఇఒ-1 ఎస్.దేవేందరరావు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావు, నోడల్ అధికారి కె.శ్రీనివాస్, ఎంఇఒ-2 ఎం.పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.



మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

ఇచ్ఛాపురం : జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన పెంచుకోవాలని బాలురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్యశ్రీమహంతి అన్నారు. మానవ వనరులు-మహిళా సాధికారతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బి.కరుణాకర్, ఎన్.బాపూజీ వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు విష్ణుప్రియ, వర్షిత, శివాని గెల్చుకున్నారు. ఎన్ఎస్ఎస్ పిఒ రజనీకుమారి, ఎజిఎంఒ ప్రియ, సుధాకర్, వై.జనార్ధనరావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎర్రముక్కాంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ షీలా ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో చేపట్టిన ఈ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే క్రమంలో విద్యార్థులకు హోంవర్క్ కోసం నిత్యం సెల్‌ఫోన్లతో కుస్తీ పడటం మన ఇంట్లో చూస్తూనే ఉన్నామని అన్నారు. ప్రతి హోమ్‌వర్క్ కూడా పిడిఎఫ్ రూపంలో వాట్సాప్‌లో పంపించి పిల్లలకు రాసుకుని రమ్మని చెబుతుంటారని అన్నారు. ఈ కారణంగా పిల్లల్లో స్క్రీన్ టైం అనేది చాలా ఎక్కువగా పెరిగిందని తెలిపారు. తద్వారా దృష్టిలోపాలు పెరుగుతున్నాయని అన్నారు. దీనిని గ్రహించి తీర ప్రాంత పరిరక్షణ కన్వీనర్, స్థానిక ఉపాధ్యాయులు బైపల్లి బాబూరావు ఆలోచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.కంటి శుక్లం, వక్రీభవన లోపాలు, కార్నియా అంధత్వం, బాల్య అంధత్వం వంటి సమస్యలను పరిష్కరించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



బైపాస్ కూడలి వద్ద గోతులమయంగా మారిన రోడ్డు



డే అండ్ నైట్ వంతెన సమీపంలో దారుణంగా ఉన్న రోడ్డు

గుంతల రోడ్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలో ప్రధాన రోడ్లు గోతులమయంగా మారాయి. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైంది. కిమ్స్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. తారు రోడ్డుపై లేయర్ ఊడిపోయింది. చినుకుపడితే చాలు రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతుంది. కుశాలపురం బైపాస్ నుంచి ఏడురోడ్ల కూడలి వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. వర్షంపడితే రోడ్డుపై గోతులు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కిమ్స్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు పరిస్థితి



మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ వైకుంఠరావు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పలాస: యువకులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు అన్నారు. స్థానిక శ్రీవిద్యా వాహిని డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎంటర్ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. థ్రెడ్ జిఐటి ప్రాజెక్టు ఇన్‌ఛార్జి అరుణ్‌కుమార్, కాలేజీ డైరెక్టర్ పి.తిరుమలరావు, ఎఒ పి.సంధ్యారాణి, ప్రిన్సిపల్ ఆయుధం గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ యువత పారిశ్రామిక సృజనాత్మకతను వెలికి తీసి, వారికి నైపుణ్యాన్ని జోడించి యువత పారిశ్రామిక వేత్తలుగా మారితే చాలా వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. అలాగే అనేకమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునన్నారు. అనంతరం మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో థ్రెడ్ జిటిఎం ఎ.రాజు, పవన్, మధు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఎడిఆర్‌ఎంకు అభినందనలు

సోంపేట : వాల్తేర్ డివిజన్ ఎడిఆర్‌ఎంగా కుందు రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కాలంలోనే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా విజయవాడ డివిజన్ నుంచి ఉద్యోగోన్నతి పొందిన రామారావు ఎడిఆర్‌ఎంగా సంపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. తన తల్లి విశ్రాంత రైల్వే ఉద్యోగి చంద్రావతి, కుటుంబ సభ్యులు ఆశీస్సులు తీసుకొని బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని రామారావు తెలిపారు. రామారావు స్వగ్రామం సోంపేట ఎర్రముక్కాలో యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రైల్వే అభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని తెలిపారు.

అలరించిన గాత్ర కచేరీ

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో నందన్న ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గాత్ర కచేరి ఆకట్టుకుంది. కచేరీలో కుమారి గాత్రానికి లోళ్ల రాంబాబు మృదంగం సోంపేట వాస్తవ్యులు గోవింద హార్మోనియం తోడవడంతో కచేరీ ఆహుతులను అలరించింది.



కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు